ఝరాసంగం: మాజీ సర్పంచులను పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

మునిపల్లి: బుదేరా పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు


జహీరాబాద్: మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

కోహీర్: పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

బిల్లులు అడిగితే అరెస్ట్ చేస్తారా?

ఎక్కడికక్కడ మాజీ సర్పంచ్‌ల అరెస్ట్.. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం

చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగితే అరెస్ట్ చేస్తారా అని మాజీ సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లుల కోసం సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు తరలుతున్న మాజీ సర్పంచ్‌లను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సొంత డబ్బులు, అప్పు తెచ్చి మరీ గ్రామాభివృద్ధికి పాటుపడ్డామని, ప్రజాపాలనలో ప్రజాప్రతినిధులను పట్టించుకోరా అని ప్రశ్నించారు. సొంత డబ్బులు పెట్టి అభివృద్ధి పనులు చేస్తే ఇప్పటివరకు బిల్లులు మంజూరు చేయకపోవడం సరైంది కాదన్నారు. మాజీ సర్పంచ్‌లపై కక్షసాధింపు వద్దని, ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 9

హత్నూర: మాజీ సర్పంచ్‌లను హత్నూర పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

గుమ్మడిదల: కాంగ్రెస్ తీరును నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సదాశివపేట: పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

నారాయణఖేడ్: పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

బొల్లారం: అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

రాయికోడ్: పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు


గుమ్మడిదల: మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా హౌస్‌అరెస్ట్ చేసిన పోలీసులు

వృద్ధురాలిని చేరదీసిన పోలీసులు

కోహీర్, డిసెంబర్ 9: మండలంలోని దిగ్వాల్‌లో 65వ జాతీయ రహదారి పక్కన సొమ్మసిల్లి పడిఉన్న వృద్ధురాలిని పోలీసులు చేరదీశారు. సోమవారం వెంకటాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు పంబలి ఆశమ్మ రోడ్డు పక్కన పడి ఉండడం గమనించిన పోలీసులు ఆమెను దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందించారు. అనంతరం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

పత్తి పంట వ్యర్థాలను పొలంలో కాల్చొద్దు

రాయికోడ్, డిసెంబర్ 9: పత్తి పంట వ్యర్థాలను పొలంలో కాల్చొద్దని వ్యవసాయ డివిజన్ ఏడీఏ సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని యూసుఫ్, నల్లంపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. చేనులో పత్తి కట్టెలను కాల్చొద్దని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి సారిక ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

జహీరాబాద్, డిసెంబర్ 9: న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ప్లేట్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఉద్యోగి నర్సింహారావు కుల కర్ణి సొంత ఖర్చుతో 115 మంది విద్యార్థులకు మండల విద్యాధికారి మారుతీరాథోడ్‌తో కలిసి ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గురునాథ్ రావు, రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 9: అవినీతి నిర్మూలనలో యువత భాగస్వామ్యం తప్పనిసరి అని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, జీవ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, బంధుప్రీతి, పక్షపాతము వంటివి దేశ అభివృద్ధిని నిరోధిస్తాయని చెప్పారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరన్నారు. అప్పుడే సుపరిపాలనకు అడుగులు పడతాయన్నారు. కార్యక్రమంలో జంతుశాఖ అధిపతి రమేశ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ జగదీశ్వర్ పాల్గొన్నారు.

కార్యదర్శులను సర్వే నుంచి మినహాయించాలి

రాయికోడ్, డిసెంబర్ 9: ప్రభుత్వం ప్రజలకు మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యాదర్శులు స్థానిక ఎంపీడీవో ఎంఎం షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం రాయికోడ్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు షరీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె సైరన్

రామచంద్రాపురం, డిసెంబర్ 9: సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఉద్యోగులు నిరవధిక సమ్మెకు మంగళవారం నుంచి దిగుతున్నారు. సోమవారం ఆర్సీపురం ఎంఈవో కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె నోటీసును ఎంఈవో పీపీ రాథోడ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సురేశ్, వెంకటయ్య, ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతోపాటు పేస్కేల్ ఇస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడస్తున్నా తమ గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులకు పేస్కేల్, పర్మినెంట్‌తో పాటు మహిళలకు 180రోజులు ప్రసూతి సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు విజయ్, భాస్కరచారి, రవీందర్, స్వప్న, షాయిదా బేగం ఉన్నారు.

రామచంద్రాపురం: సమ్మె నోటీసు అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

బొల్లారంలో..

బొల్లారం డిసెంబర్ 9: విద్యాశాఖలో అరకొర వేతనాలతో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. ఈ మేరకు జిన్నారం మండల ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామికి ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో సీఆర్పీలు శ్రీనివాస్, రజిత, వేణు, భాస్కర్, మెసెంజర్ కృష్ణ పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

కంది, డిసెంబర్ 9: ఐఐటీ హైదరాబాద్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్) 2024 గ్రాండ్ ఫినాలే నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. వ్యవసాయ ఆవిష్కరణలపై దృష్టి సారించి గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తున్నారు. ఈ ఫినాలేను వర్చువల్‌గా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రారంభిస్తారు. ఎన్ఎఆర్ఎం డైరెక్టర్ శ్రీనివాస్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్, ప్రొఫెసర్ బి.ఎస్ మూర్తి కార్యక్రమ వివరాలను సోమవారం వెల్లడించారు. ఇందులో దేశవ్యాప్తంగా 200 మంది మార్గదర్శకులతో కూడిన 26 బృందాలు పాల్గొంటాయని తెలిపారు. రైతులకు ప్రత్యక్ష మార్కెట్ యాక్సెస్ కోసం మొబైల్ యాప్, అధిక దిగుబడి కోసం స్థిరమైన ఎరువుల వినియోగం, స్థిరమైన మార్కెట్ యాక్సెస్ కోసం హామీ ఇచ్చిన కాంట్రాక్ట్ ఫార్మింగ్ సిస్టమ్ తదితర అంశాలపై పాల్గొనే బృందాలు పరిష్కారం చూపనున్నారు. ఇందులో గెలుపొందిన నాలుగు జట్లకు ఒక్కొక్కరికి రూ.లక్ష నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పండుగలకు పెద్దపీట

రామచంద్రాపురం, డిసెంబర్ 9: బీఆర్ఎస్ హయాంలో అన్ని మతాల పండుగలకు పెద్దపీట వేశామని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్‌లో ప్రశాంత్ పాస్టర్ ఆధ్వర్యంలో పాస్టర్స్ అండ్ ఇవాంజెలిస్ట్స్ ఫెలోషిప్ నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అన్నిమతాలకు సమన్యాయం చేస్తూ పండుగలు, సంస్కృతిని గౌరవం కల్పించిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పండుగలకు గుర్తింపు కరువైందని ఆరోపించారు. క్రైస్తవులకు గిఫ్ట్ ప్యాక్‌లు అందించడం లేదన్నారు.

చెక్కుల పంపిణీ

జహీరాబాద్, డిసెంబర్ 9: నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్‌లోని ఎస్వీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు

జిల్లాస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

గుమ్మడిదల, డిసెంబర్ 9: జీవశాస్త్ర ప్రతిభ పరీక్షలో గుమ్మడిదల మండల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో రాంబాబు, ఉపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన జీవశాస్త్ర ప్రతిభ పరీక్షలో దోమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి శివం ప్రథమ బహుమతి, వినయ్‌సాగర్ ఇంగ్లిష్ మీడియంలో ద్వితీయ బహుమతి పొందారు. తెలుగు మాధ్యమంలో దోమడుగు జడ్పీహెచ్‌కు చెందిన హర్షిక, ఇంగ్లిష్ మీడియంలో అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జస్వంత్ ద్వితీయ బహుమతి పొందారు. ఈనెల 18న జిల్లా స్థాయిలో జరిగే ప్రతిభా పరీక్షకు ఎంపికైనట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు వాకిట శ్రీదేవి, విజయ్‌కుమార్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రామరాజు, రాజేశ్వరి, లక్ష్మణాచారి, హరీశ్‌కుమార్, రవీందర్‌నాయక్ విద్యార్థులను అభినందించారు.

ఘనంగా బోనాలు

కోహీర్, డిసెంబర్ 9: మండలంలోని మద్రిలో మల్లికార్జునస్వామి ఆలయ ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో యజ్ఞం

కోహీర్, డిసెంబర్ 9: మండలంలోని కవేలి గ్రామంలోని కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి ఆరాధనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో దేశికాచార్యుల ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాలను పఠిస్తూ గీతా యజ్ఞం చేశారు. వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు భజనకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

పోలింగ్ బూతుల వివరాలు సరి చూసుకోవాలి

అందోల్, డిసెంబర్ 9: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వివరాలను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని ఎంపీవో అశోక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 12వ తేదీలోగా గ్రామ కార్యదర్శికి గానీ, మండల కార్యాలయంలో గానీ రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 9: బాలల హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని జెడ్పీ సీఈవో జానకీరెడ్డి అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యక్రమంలో బేటీ బచావో బేటీ పడావో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ల సేవలపై, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో స్వప్న, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, సూర్యకాంత్, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

నారాయణఖేడ్, డిసెంబర్ 9: మండలంలోని అంగీర్గా బీ గ్రామానికి చెందిన సంతోషకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.13,000 చెక్కు, చల్లగిద్ద తండాకు చెందిన నిషితకు రూ.6,500 చెక్కులను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ కోఆప్షన్ సభ్యుడు నవాబ్, కురుమ సంఘం తాలుకా ఉపాధ్యక్షుడు మల్‌గొండ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట్, డిసెంబర్ 9: ర్యాలమడుగు గ్రామానికి చెందిన హరిసింగ్‌కు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు (రూ.60 వేలు)ను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భుపాల్‌రెడ్డి అందజేశారు.

ఏడాదైనా సాగునీటి చర్యలు శూన్యం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబర్ 9: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా నారాయణఖేడ్ నియోజకవర్గంలో సాగునీటి రంగానికి చేసింది శూన్యమని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో ఒక్క చెరువు, కుంటను సైతం బాగు చేసిన పాపాన పోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు ఈ ప్రాంత అభివృద్ధిపై, రైతులపై చిత్తశుద్ధి ఉంటే బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ కాకతీయ పథకం కింద ప్రతి చెరువును పునరుద్ధరించి చివరి ఆయకట్టుకు సాగు నీరందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. నల్లవాగు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం ఉన్నప్పటికీ చివరి ఆయకట్టుకు నీటిని విడుదల చేయకుండా కేవలం 4,089 ఎకరాలకు మాత్రమే నీటిని విడుదల చేయడం ఎమ్మెల్యే అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. అసెంబ్లీ ఆవరణలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. రేవంత్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రవీందర్‌నాయక్, ముజామిల్, శ్రీనివాస్, రాజునాయక్, సిద్దు, మల్‌గొండ పాల్గొన్నారు.

మహిళ కాలుపై నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు

అందోల్, డిసెంబర్ 9: మహిళ కాలుపై నుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో కాలు విరిగిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. అన్నాసాగర్ గ్రామానికి ఎరుకల పెంటమ్మ సోమవారం చిలిపిచెడ్ వెళ్లేందుకు బస్సుకోసం చౌరస్తాలో నిలబడింది. ఇదే సమయంలో నర్సాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రావడంతో అందులో ఎక్కేందుకు వెళ్లింది. ఇదే సమయంలో డ్రైవర్ బస్సును ముందుకు తీశాడు. దీంతో పెంటమ్మ కింద పడిపోవడంతో బస్సు ఆమె కాలిపై నుంచి వెళ్లింది. ప్రమాదంలో కాలు పూర్తిగా దెబ్బ తినడంతో ఆమె ఆర్తనాదాలు చేస్తూ రోదించిన తీరు ప్రతిఒక్కరినీ కంటతడి పెట్టించింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని.. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడినుంచి పరారయ్యాడని స్థానికులు ఆరోపించారు. గాయపడిన పెంటమ్మను జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి తరలించారు. ప్రమాదానికి సంబంధించి బాధితురాలి కుంటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ రవీందర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు.

తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం

గుమ్మడిదల, డిసెంబర్ 9: విజయ్ దివస్‌ను పురస్కరించుకొని బీఆర్ఎస్ నాయకుల తెలంగాణతల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణకు పునాది వేసిన డిసెంబర్ 9ని పురస్కరించుకొని సోమవారం గుమ్మడిదలలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మంద భాస్కర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంజనేయులుయాదవ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, నాయకులు చిమ్ముల నరేందర్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, దేవేందర్‌రెడ్డి, సదానందారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మొగులయ్య తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి అవమానిస్తున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

తెలంగాణతల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

బొల్లారం డిసెంబర్ 9: జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. 18 పడి మెట్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు మాజీ బడ్పీటీసీ బాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, రాష్ట్ర యువత నాయకుడు వెంకటేశం గౌడ్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు శివరాజ్, సురేందర్‌గౌడ్, రాజేశ్, నరేందర్, లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహా పడి పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

వృథాగా 'భగీరథ'

గుమ్మడిదల, డిసెంబర్ 9: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కావడంతో పొంటేన్‌ను తలపిస్తున్నది. సోమవారం సాయంత్రం మండలంలోని అన్నారం – దోమడుగు గ్రామాల మధ్య ఉన్న మిషన్ భగీరథ పైప్ లైన్ లీక్ కావడంతో వేల లీటర్ల నీరు వృథాగా రోడ్డు పాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ సిబ్బంది పైప్ లైన్ లీక్‌ను సరి చేయడంలో నిమగ్నమయ్యారు.

హైమాస్ట్ లైట్ల పునరుద్ధరణ

బొల్లారం డిసెంబర్ 9: ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాడుకలో లేని హై మాస్ట్ లైట్లను పునరుద్ధరించి సమస్యలు పరిష్కరించాలని సభ్యులు ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో కోరిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు సోమవారం మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ఏఈ కిష్టయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేసి కొత్తవి ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు మున్సిపల్ వ్యాప్తంగా హై మాస్ట్ లైట్ల ఏర్పాటు పనులను పూర్తి చేస్తామన్నారు. ఆయా వార్డుల్లో శిథిలమైన సీసీ రోడ్లకు ప్యాచ్ వర్క్ పనులను వారంలో పూర్తి చేస్తామని తెలిపారు.

కంప్యూటర్లు అందజేత

కంప్యూటర్లు అందజేస్తున్న టీనా అధ్యక్షుడు రమణ, కోటేశ్వరరావు

రామచంద్రాపురం, డిసెంబర్ 9: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ కంప్యూటర్ విద్యను చేరువ చేస్తున్నది. సోమవారం తెల్లాపూర్‌లోని ఇంద్రానగర్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు బ్లూఫీల్డ్ వాసి కోటేశ్వరరావు టీనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణతో కలిసి ఆరు కంప్యూటర్లు అందజేశారు. కార్యక్రమంలో టీనా, నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL MEGISTEATE OF FIRST CLASS : ZAHEERABAD
O.S.NO. 62 OF 2023

BETWEEN:
Vadla Jagadeeshwar & other ...Plaintiffs
AND
The Tahasildar, Nyalkal Mandal
All Concerned & another ...Defendants
To
All Concerned

Please take notice that the above named plaintiffs filed above suit for Declaration of Plaintiffs as legal heir of deceased Father and Mother of the plaintiff. If any person or persons having any objections over the relief clamed in the above suit are, do hereby required to appear in person or through an Advocate before this Hon'ble Court on 22-01-2024 at 10.30 A.M. either any person or through your Pleader and to file your written statement or objections, if any failing which the matter will be decided in your own absence.

//BY ORDER OF COURT//
P. MADHUSUDAN REDDY,
Advocate
Flat No. 502, Chandan Tara Residency, D.D. Colony, Amberpet, Hyderabad-500 013, **Ph: 9866415506.**